16న ఉద్యోగ మేళా

కడప : జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, డిఆర్డిఎ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16న ఉదయం 10 గంటలకు కడప కలెక్టరేట్‌లోని ఓ- బ్లాక్‌లో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి పి. దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆల్ డిక్సాన్ టెక్నాలజీస్ కంపెనీలో అసెంబ్లింగ్ ఆపరేటర్, అపోలో ఫార్మసీ కంపెనీలో రిటైల్ అసోసియేట్ /ఫార్మసిస్ట్ ఉద్యోగ భర్తీ కోసం ఉద్యోగ మేలా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిప్లమా, ఏదేని డిగ్రీ, ఎం ఫామ్, బి ఫామ్, డి ఫామ్, పిసి ఐ చేసిన వారు అర్హులని తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు www.ncs.gov.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 9908808914లో సంప్రదించవచ్చునని తెలిపారు.

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ షురూ!

1.92 లక్షల ఎకరాల్లో సాగు ప్రణాళిక
11,784 క్వింటాళ్లలో సబ్సిడీ విత్తనం
64,150 క్వింటాళ్ల ఎరువులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సిద్ధమైంది. జిల్లా వ్యవసాయ శాఖ 1.92 లక్షల ఎకరాల్లో పంటలు సాగుకు కసరత్తు చేస్తోంది. 64,150 క్వింటాళ్ల మేర ఎరువులు, 11,784 క్వింటాళ్ల సబ్సిడీ విత్తన ప్రతిపాదనల్ని అందజేసింది. ప్రభుత్వ ఆమోదం లభించిన అనంతరం పంపిణీ చేయడానికి అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమైంది. జిల్లాలో వేరుశనగ మినుములు, కందులు, నువ్వ విత్తనాలకు సబ్సిడీతో అందజేయనుంది. జిల్లాలోని 210 ఆర్‌బికెల ద్వారాల విత్తనం, ఎరువులు, ట్రాక్టర్ల పంపిణీ ఏర్పాట్లపై దృష్టి సారించింది. జిల్లా వ్యవసాయ శాఖ 11,784 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాన్ని సరఫరా చేయనుంది. 32,741 ఎకరాల్లో పచ్చిరొట్ట ఎరువులను సాగు చేయనుంది. జీలగ 4781 క్వింటాళ్లు, జనుము 383 క్వింటాళ్లు, పిల్లిపె సర 170 క్వింటాళ్లలో సాగు చేయడానికి అవసరమైన చర్యలు తీసు కుంటోంది. వీటితోపాటు 5730 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాన్ని అందుబాటులో ఉంచనుంది. కె6 రకం 4050 క్వింటాళ్లు, నారాయణి రకం 1580 క్వింటాళ్లు, లేపాక్షి రకం 100 క్వింటాళ్లు సరఫరా చేయనుంది. పెసలు 35 క్వింటాళ్లు, నువ్వులు 1268, కందులు 3685 క్వింటాళ్లను అందజేయనుంది. 64,150 క్వింటాళ్ల ఎరువులను ప్రతిపాదనలు అందజేసింది. ప్రభుత్వం ఆమోదం లభించిన అనంతరం సరఫరా చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేసింది. 12,162 క్వింటాళ్ల యూరియా, 5,753 క్వింటాళ్ల డిఎపి, 2, 669 క్వింటాళ్ల ఎంఒపి, 3106 క్వింటాళ్ల ఎస్ఎస్‌పి, 34,377 క్వింటాళ్ల కాంప్లెక్స్, ఇతరములు 918 క్వింటాళ్ల ఎరువులను అందుబాటులో ఉంచడానికి అవసరమైన చర్యలు తీసుకుంది. వీటిని ప్రతినెలా పంటల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్‌బికెల ద్వారా రైతులకు సరాఫరా చేయనుంది.

ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుందాం

29న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా
ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - కడప అర్బన్

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడం కోసం ఈ నెల 29న కలెక్టర్ వద్ద ధర్నా నిర్వహించనున్నామని, కూలీలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శివకుమార్, వి.అన్వేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం బస్టాండ్ లోని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుందాం.. ఉపాధి కూలీల సమస్యలపై ఈ నెల 29న జిల్లా కలెక్టర్‌కు చెప్పుకుందాం రండి' అనే కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రెండు పూటల పని రద్దు చేయాలని, సమ్మర్ అలవేషన్స్ 40 శాతం ఇవ్వాలని, వందరోజులు పూర్తి చేసిన కుటుంబానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం పని కల్పించాలని, గ్రామాలతో పాటు పట్టణాలలో కూడా ఉపాధి పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఆరు సంవత్సరాల నుంచి పనిముట్లు ఇవ్వలేదని తెలిపారు. ఆన్‌లైన్ మస్టర్ రద్దు చేసి పాత పద్ధతిలో విధానాన్ని అమలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో మేట్లకు స్మార్ట్ ఫోన్, ఐదు రూపాయలు పారితోషకం అమలు చేయాలన్నారు. చేసిన పనులకు ఐదు వారాల నుంచి డబ్బులు చెల్లించలేదని వెంటనే ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కూలీల డబ్బులు నవరత్నాలకు ఇతర వాటికి ఖర్చు పెట్టడం సరైంది కాదని చెప్పారు. సమస్యలపై ఈనెల 29న కలెక్టర్ కార్యాలయానికి కూలీలందరూ చేరుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నరసయ్య, రామప్ప, వీరయ్య, పోలయ్య, గోవిందు, రామచంద్రుడు, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

జోరుగా వరి ధాన్యం విక్రయాలు

ప్రజాశక్తి - చాపాడు

ధాన్యాన్ని లారీలోకి ఎక్కిస్తున్న కూలీలు

రబీ సీజన్‌లో సాగైన వరి పంట నూర్పిడి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పంట నూర్పిడి చేయగానే రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి పంట పొలాల్లోనే అమ్మకాలు చేపడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో ధాన్యాన్ని వీలైనంత త్వరగా అమ్మకాలు చేపడుతున్నారు. ప్రస్తుతం 8 బస్తాలు పుట్టి ధర రూ.11 వేలకు పైగా పలుకుతున్నాయి. ప్రారంభంలో రూ.12వేల వరకు ధర ఉన్నప్పటికీ క్రమేపీ తగ్గుతూ రూ. 11 వేలకు చేరుకున్నాయి. మైదుకూరు, చాపాడు, దువ్వూరు మండలాల్లో ఈఏడాది కేసి కాలువకు ఏప్రిల్ చివరి వరకు నీరు విడుదల కావడంతో రెండవ దఫా వరి సాగు పెరిగింది. ఆశాజనకంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు 32 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చిందని పేర్కొంటున్నారు. రెండో దఫా నియోజకవర్గ వ్యాప్తంగా 15వేల ఎకరాలలో వరి పంటను రైతులు సాగు చేపట్టారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరి ధాన్యం నిలువలు ఉండడంతో తిరిగి రెండవ దఫా పండించిన దిగుబడి నిల్వకు అవకాశం లేకపోవడంతో పంట పొలాల్లోనే అమ్మకాలు చేపడుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయివేట్ వ్యాపారులకు అమ్మకాలు చేపడుతున్నారు. ఖాళీ ప్రదేశాలు అనుసంధాన రోడ్ల వెంబడి ధాన్యాన్ని ఆరబోసి అమ్మకాలు చేపడుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి

వైసిపి అరాచక పాలనకు చెంపపెట్టు

ప్రజాశక్తి - కడప

కోర్టు తీర్పు వైసిపి అరాచక పాలనకు చెంపపెట్టు అని కాంగ్రెస్ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టులో జీవో నంబరు 1 రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై దౌర్జన్యాలు ఇప్పటికైనా మానుకోవాలన్నారు. ప్రభుత్వం తప్పులు చేస్తే ప్రజల కోసం నిరసనలు, ధర్నాలు చేసే హక్కు ప్రతి పక్షాలకు, ప్రజా సంఘాలకు ఉందని చెప్పారు. కోర్టులో ఎన్ని సార్లు ఓడిపోయినా జగన్ ప్రభుత్వానికి బుద్ధి రాలేదన్నారు. న్యాయ వ్యవస్థలున్నాయే కాబట్టే కొంతవరకైనా ప్రతిపక్షాలు ప్రజాస్వామ్యంపై నమ్మకాలు పెట్టుకున్నారని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభించకపోతే జీవో నంబరు ఒకటి తెచ్చి ప్రతి పక్షాల గొంతు నొక్కాల్సిన అవసరమేముందని పేర్కొన్నారు. ఇకనైనా మీ పద్ధతులు మార్చుకొని ప్రజాసంక్షేమం కోసం పనిచేయాలని హితవు పలికారు. సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు మామిళ్ల బాబు పాల్గొన్నారు.

14న ఆత్మీయ సమావేశం

కడప అర్బన్ : జిల్లాలో వామపక్ష పార్టీల సీనియర్ నాయకులు ఆత్మీయ సమావేశం ఈ నెల 14న ఉదయం 10 గంటలకు నగరంలోని ఐఎంఎ హాల్ లో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు. సి.ఆర్ వి. ప్రసాద్ రావు, డబ్ల్యూ. రాము తెలిపారు. శుక్రవారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు పోరాటాలు నిర్వహించిన సీనియర్ నాయకులను అందరినీ ఒక వేదిక పైకి తీసుకురావడం కోసం ఈ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో వామపక్ష భావాలు కలిగిన వ్యక్తుల కలయిక అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. వామపక్ష వాదం అంతరించి పోతుందనే తప్పుడు ప్రచారం కొనసాగుతూ ఉందని తెలిపారు. దీనిని తిప్పికొట్టేందుకు వామపక్ష సీనియర్ నాయకులు సలహాలు, సూచనలను తీసుకునేందుకు ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు, ముఖ్య నాయకులు హాజరవుతున్నారని చెప్పారు. జిల్లాలో సీనియర్ వామపక్ష పార్టీ నాయకులు సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అమృత టీ స్టాల్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప

టీస్టాల్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం

నగరం లోని ఏడు రోడ్ల వద్ద ఉన్న ద్వారకా టవర్స్ కాంప్లెక్స్‌లో వైసిపి నాయకులు, బేడబుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయ కులు పస్తం అంజి ఏర్పాటు చేసిన అమృత టీ స్టాల్ ను డిప్యూటీ సిఎం ఎస్.బి అంజాద్‌బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ సురేష్ బాబు లాంఛనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టమర్లకు అందులో టీ, టిఫెన్ కూల్ డ్రింక్స్ ఇక్కడ అందు బాటులో ఉన్నాయని చెప్పారు. సరసమైన ధరలకు లభిస్తాయని అన్నారు పస్తం అంజి ఇటు రాజకీయంలోనే కాకుండా వ్యాపార రంగంలో కూడా ఉన్నత స్థాయి కి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు నాగయ్య యాదవ్, వైసిపి నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, షఫీ, బిసి సంక్షేమం సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ సోహెల్ హమ్మద్, లింగమూర్తి, జిఎన్ఆర్ జ్యువెలర్స్ అధినేత గోవిందు నాగరాజు, సిఆర్ఐ శ్రీను, ప్రముఖ సాహితీవేత్త గానుగ పెంట హనుమంతరావు పాల్గొన్నారు.

ముమ్మురంగా కోటవీధి రోడ్డు పనులు

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్

రాజ్యసభ సభ్యులు సిఎం రమేష్ నిధుల నుంచి విడుదలైన రూ. 30 లక్షల తో పోరుమామిళ్ల పట్టణం కోటవీధిలోని 20 అడుగుల సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మురంగా సాగుతున్నాయి. శుక్రవారం నాలుగు ట్రాక్టర్లు, ఒక డోజర్‌తో పనులు చేపట్టారు. కూలీలు రోడ్డును చదును చేస్తూ ఇరుపక్కల ఉన్న గుంతలను పూడ్చారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే కోటవీధి రూపు రేఖలు మారుతాయనడంలో అనడంలో ఎలాంటి సందేహంలేదు. పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ నాయుడు దగ్గరుండి పనులను పర్యవేక్షస్తున్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రసాద్

తప్పుడు కేసులు సిగ్గుచేటు

ప్రజాశక్తి - కడప అర్బన్

కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి బలిజ సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తప్పుడు కేసులు నమోదు చేయించడం సిగ్గుచేటని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్ కేసులో వెళ్లిన మహిళ సంతకం తీసుకుని కార్పొరేటర్ నరేంద్రపై తప్పుడు ఆత్యాచార కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఎస్‌పి అన్బురాజన్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని విమర్శించారు. తప్పుడు కేసని తెలిసి కూడా సహకరించడం సరికాదని చెప్పారు. వివేకా హత్య కేసు కాలయాపన కావడానికి ఎస్‌పినే కారణమని ఆరోపించారు. పవన్ కల్యాణ్ చంద్రబాబుతో కలవడం ఆ సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసుకుని తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. సామాజిక వర్గం ఓట్లు రావనే పోలీసులను అడ్డం పెట్టుకుని బెదిరింపులకు దిగుతున్నారని పేర్కొన్నారు. ఎస్‌పి వైసిపికి తొత్తుగా వ్యవహరిస్తున్నారు. పోలీసులను, అధికారులను అడ్డం పెట్టుకుని సిఎం జగన్ ఎంతకైనా తెగబడుతున్నారని చెప్పారు. ఎస్‌పి తీరు మార్చుకోకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి నీచంగా, పైశాచికంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. పార్టీలో మిగిలేది తండ్రి కోడుకులిద్దరే అన్నారు.

ద్వితీయ స్థానంలో నిలిచిన 30 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సిసి కేడెట్లు

ద్వితీయ స్థానంలో ఎన్‌సిసి కేడెట్లు

ప్రజాశక్తి - కడప

ఇటీవల చిత్తూరులో పివికెఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సిఎటిసి-1 క్యాంపులో తల్‌సేవ క్యాంపు ఇంటర్ గ్రూప్ కాంపిటేషన్స్ నిర్వహించారు. క్యాంపులో మ్యాప్ రీడింగ్, గుడారాల నిర్మాణం, ఆరోగ్య, విద్య, ఆప్టికల్స్, ఫైరింగ్‌లలో పోటీలను నిర్వహించారు. ఇందులో 30 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి కేడెట్లు అద్భుతమైన ప్రతిభ కనబరచడంతో ద్వితీయ స్థానం లభించింది. ఈ విజయం పట్ల 30 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఆర్.కె.తాపగ అభినందనలు తెలియజేశారు. గ్రూప్ స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించడంలో పరేడ్ శిక్షకులు, ఎన్‌సిసి అధికారులు, సిబ్బంది సహాయ సహకారాలు అందించారని అన్నారు. కలిసికట్టుగా పనిచేసి 30 ఆంధ్ర బెటాలియన్ ఉన్నత స్థాయికి తీసుకురావాలని ఆశాభావం వ్యక్తపరిచారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు : టిడిపి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ఎక్కువ శాతం మంది తెలుగుదేశం పార్టీవైపు మక్కువ చెబుతున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి. వి ప్రవీణ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజవర్గ పరిధిలో శుక్రవారం పవర్ హౌస్ రోడ్డు లో తిరుగుతూ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రజలకు ఎలాంటి మేలు చేసే కార్యక్ర మాలు చేయలేదని తెలిపారు. శాశ్వతమైన పథకాలు ప్రవేశపెట్టిన ఘనత చంద్ర బాబునాయుడుకే దక్కుతుందని చెప్పారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రాబోవు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. ఒక్క నియోజకవర్గమేగాక రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఖలీల్ భాష, నాయబ్‌బాష, రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి ముక్తియార్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, దాదా పీర్, వెలువలి జాకీర్, మెరువా మూర్తి , పెన్నా నగర్ మజీద్, గోపవరం గౌస్, భగత్ సింగ్ కాలనీ పట్నం మాబాష, శివ, పగిడాల కన్నయ్య, చిన్న , ఈశ్వర్ రెడ్డి నగర్ చలమయ్య, రామచంద్రారెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనితీరులో జిల్లా వ్యవసాయాధికారి ప్రథమం

కడప : 26 జిల్లాల్లోనే నాలుగు నెలల పాటు జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పనితీరు చక్కగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం కితాబిచ్చింది. ముఖ్యంగా ఈ ఏడాది ఏప్రిల్ నెలలకుగాను ఆయన నిర్వ హిస్తున్న విధుల్లోనే ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో నాగేశ్వరరావును ఉన్నతాధికారులు, సహచ రులు అభినందనలు తెలియజేశారు. రాబోవు రోజు ల్లోనూ మంచిగా సేవలందించి మొదటి స్థానాన్ని నిలుపుకోవాలని ఆకాక్షించారు.

మొక్కకు నీళ్లు పోస్తున్న విసి చింతా సుధాకర్

మొక్కల సంరక్షణ మన బాధ్యత : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరీ బాధ్యత అని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. శుక్రవారం విశ్వవిద్యాలయ బొటానికల్ గార్డెన్‌ను ఆయన సందర్శించారు. గార్డెన్లో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా గార్డెన్‌లో వివిధ జాతుల మొక్కల సంరక్షణ , అంతరించిపోతున్న జాతుల మొక్కల పెంపకం గురించి గార్డెన్ బాధ్యులు ఆచార్య మధుసూదన్ రెడ్డి విసికి వివరించారు. వృక్షశాస్త్ర ఆచార్యులుగా, పరిశోధకులుగా తనకు మొక్కల పెంపకం పట్ల ఆసక్తి ఎక్కువ అని, గార్డెన్ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర రెడ్డి, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ ఎ.స్వి. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య

ఇవిఎంలు లేకుండా ఎన్నికలకు బిజెపి సిద్ధమా?

ప్రజాశక్తి- ఎర్రగుంట్ల

బిజెపి ఇవిఎంలు లేకుండా బ్యాలెట్ ద్వారా ఎన్నికలకు సిద్ధమా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి అధికారంలోకి రావడానికి ఎన్ని అడ్డదారులు వెళ్లడానికైనా సిద్ధంగా ఉందని చెప్పారు. కర్ణాటక లో అధికారంలోకి రావడానికి ముస్లిములకు 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేసిందని పేర్కొన్నారు. మతాన్ని ఎన్నికల్లో వాడుకుందని చెప్పారు. దేశంలో తమ అధికారానికి తిరుగు లేదని సిబిఐ, ఈడీ తమ చెప్పు చేతుల్లో పెట్టుకొని ఇష్టా రాజ్యంగా వ్యవహారిస్తోందని వాపోయారు. ఇప్పటికే దేశంలోని ప్రభుత్వ రంగంలోని ఎల్ఐసి, బిఎస్ ఎన్ ఎల్, రైల్వే, ఓడరేవులు, విమానశ్రయాలు, రోడ్లు, గనులు ఇలా దేన్నీ వదలకుండా ప్రయివేట్ వ్యక్తులకు అప్పజెపుతున్నారాన్నారు. వాటిలో ప్రధాన వాటా అదానికే ఉందన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నియోజకవర్గ కార్యదర్శి ఎం.వి సుబ్బారెడ్డి , ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ద్రవిడ సురేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని విశ్రాంతి ఉపాధ్యాయులు బండి రామచంద్ర రెడ్డి అన్నారు. శుక్రవారం పులివెందుల గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు నీతి కథలు చెప్పడం, పుస్తక పఠనం, చిత్రలేఖనం మొదలగు తరగతులు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయులు బండి రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలలో వివిధ రకాల పుస్తకాలు ఉంటాయని, వీటిని చదవడం వల్ల జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కృష్ణ కిషోర్ రెడ్డి, పాఠకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

నేడే జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - కడప

ఈనె 13న ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ కు సంబంధించి 22 బెంచీలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయ మూర్తి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్ కుమార్ తెలిపారు. ప్రజలందరూ పక్షిదారులందరూ జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని సత్ర న్యాయం పొందాలని కోరారు. కడప లో 5, ప్రొద్దుటూరులో 3, రాయచోటి లో 3, రాజంపేటలో 1, బద్వేల్ లో 2, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, మైదుకూరు, సిద్ధవటం, నందలూరు, రైల్వేకోడూరు నందు ఒక్కొక్క బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో అత్యధికంగా కేసులు పరిష్కరించ బడేలా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసులను రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చన్నారు. పూర్తి సమాచారం కోసం 08562- 258622, 244622, districts.ecourts.gov.in/Kadapa, dlsakdp@gmail.com లలో సంప్రదించాలన్నారు.

ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

కడప అర్బన్ : వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులచే పని చేయించే రెమిడియల్ తరగతుల బోధన, నాడు- నేడు పనులు పర్యవేక్షణ, వి లవ్ రీడింగు తదితర పనులకు సంబంధించిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు శుక్రవారం డిఇఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ అధ్యక్షుడు పోగుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిందని, వేసవి సెలవుల్లో ఎటువంటి బాధ్యతలు కల్పించకూడదని పేర్కొన్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి వేసవి సెలవులని తెలిపారు. సెలవుల్లో వారి వారి సొంత గ్రామాలకు వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి గడపాలనుకున్నా అధికారుల తీరుతో వారి స్వేచ్ఛకు భంగం కల్గిందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు రామమోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి. సుబ్బారాయుడు, మీడియా ఇన్‌ఛార్జులు బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు వై. సుధాకర్ రెడ్డి, రఘుప్రసాద్, చంద్రమోహన్, జిల్లా కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిబద్ధతకు మారుపేరు విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

విసిని సన్మానిస్తున్న అక్బర్‌ఖాన్

ప్రతిష్టాత్మక యోగివేమన యూనివర్సిటీకి నూతన విసిగా బాధ్యతలు స్వీకరించిన చింత సుధాకర్ నీతి, నిజాయితీ నిబద్ధతకు మారుపేరు అని అల్ హబీబా విద్యాసంస్థల చైర్మన్ లయన్ పఠాన్ అక్బర్‌ఖాన్ అన్నారు. శుక్రవారం విసిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లయన్ పఠాన్ అక్బర్ ఖాన్ మాట్లాడుతూ విసి బోధనా రంగంలో అపార అనుభవాన్ని గడించిన గొప్ప అనుభవిజ్ఞుడని తెలి పారు. పరిశోధనా రంగంలో జాతీయ, అంత ర్జాతీయంగా ఖ్యాతి గడించారని అన్నారు. ఆయన సమర్పిం చిన పరిశోధన పత్రాలు జర్మనీ, యునైటెడ్ కింగ్డమ్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, సైతం ప్రశంసించాయి అన్నారు. చింత సుధాకర్ ఆధ్వర్యంలో 26 మంది విద్యార్థులకు డాక్టరేట్లు, ప్రదానం చేశారన్నారు. ఆయన విద్యార్థులు జర్మనీ, ఇజ్రాయిల్, దక్షిణ కొరియా, చైనా, అమెరికా, ఫిలిఫిన్ లాంటి దేశాలలో సైన్సుట్లుగా, అధ్యాపకులుగా, స్కాలర్స్‌గా స్థిరపడ్డారు అని అన్నారు. యోగివేమన యూనివర్సిటీకి వైస్‌ఛాన్సలర్‌గా రావడం జిల్లా వాసుల అదృష్టమని పేర్కొన్నారు అనంతరం విసిని శాలువాతో ఘనంగా సన్మానించారు. పూల బొకేలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

రేపు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

కాశినాయన : మండల పరిధిలోని ఉప్పలూరు గ్రామంలో అభయాంజనేయ స్వామి జయంతి సందర్భంగా పెద్ద ఎత్తున రాష్ట్రస్థాయిలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ ముత్తూమల రాజనారాయణరెడ్డి, ఆర్ట్‌ఆఫ్ లివింగ్ యోగా టీచర్, సంఘ సేవకులు బి.ఎస్. నారాయణరెడ్డి ఒక సంయుక్తం ప్రకటనలో పేర్కొన్నారు. జయంతి సందర్భంగా సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. బండలాగుడు పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ. లక్ష, రెండో బహుమతి రూ.70 వేలు, మూడో బహుమతి 40 వేలు, నాల్గో బహుమతి రూ.20 వేలు అందజేస్తామన్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం ఉంటాయని తెలిపారు.

మండు వేసవిలో ఈత సరదా

ఎండ వేడిమి తాళలేక గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు సమీపంలోని కొలనులలోనూ, దిగుడు బావుల్లోనూ ఈతకొడుతూ చల్లదనాన్ని ఆస్వాధిస్తున్నారు. మండలంలోని పి. అనంతపురం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కాలనీ సమీపంలో ఉన్న బావిలో కొందరు యువకులు ఈత కొడుతూ కన్పించారు. మండు వేసవిలో ఈత కొడుతూ సరదాగా గడిపారు.

-ప్రజాశక్తి-కొండాపురం

ప్రభుత్వ ఐటిఐలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - చక్రాయపేట(వేంపల్లె)

చక్రాయపేట మండలంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటిఐ)లో 2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ రాధాకృష్ణయ్య తెలిపారు. శుక్రవారం చక్రాయపేట ఐటిఐలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదోవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో పాటు 40 సంవత్సరాలు వయస్సు కలిగిన వారు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చు అన్నారు. సాంకేతిక విద్య పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. ఐటిఐలో చేరేందుకు విద్యార్థులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. విద్యార్థులు పదోతరగతి మార్కుల జాబితాతో పాటు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, పాసు పోర్టు సైజు ఫోటోలు సమర్పించాలన్నారు. జూన్ 6 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్‌డి.అయూబ్ ఖాన్, టిడిపి నాయకులు

నిరుపేద వధువుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు పట్టణం సైదా గారి వీధిలో మన ప్రజా సేవాసమితి కార్యాలయంలో శుక్రవారం శ్రీనివాస నగర్ చెందిన కీర్తి కీర్తిశేషులు ఖాసింవలి కుమార్తె పేద వధువు ఇమాంబి పెళ్లి ఖర్చులకు టిడిపి నాయకులు వి ఎస్. ముక్తియార్, సి.ఎం. సురేష్ నాయుడు చేతులు మీదుగా వధువు తల్లికి రూ.20 వేలు నగదు, వధువుకు చీరె అందించారు. ఈ సందర్భంగా మన ప్రజా సేవాసమితి ఎండి అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ ధనవంతులు పేద వధువులకు పెళ్లిళ్ల చేయడానికి తమ వంతు సహాయం అందిసానన్నారు. పెళ్లిళ్ల కాక చాలామంది పేద యువతుల వయస్సు పైబడి నిరాశకు గురవుతున్నారన్నారు. ఇలాంటి వారిని వెంటనే ధనవంతులు గుర్తించి పెళ్లిళ్ల చేయడానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మన ప్రజా సేవాసమితి ఉపాధ్యక్షులు షేక్ సలీం, ప్రధాన కార్యదర్శి హరి యాదవ్, ట్రెజరర్ మెహమూద్, సభ్యులు షేక్ నూర్, యువత అధ్యక్షులు జహీర్, ప్రధాన కార్యదర్శి యూసుఫ్, రిహాన్, రెహమాన్ సభ్యులు పాల్గొన్నారు.

దళిత బహుజనులకు అన్యాయం

పోరుమామిళ్ల టౌన్ : అసైన్మెంట్ కమిటీ జరుగక పోవడం వల్ల దళిత బహుజనులకు అన్యాయం జరుగుతుందని పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి, సామాజిక సంఘాల అధ్యక్షులు ఇండ్ల రామసుబ్బయ్య పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12 ఏళ్ల కిందట అసైన్‌మెంట్ కమిటీ జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటి కమిటీ జరగకపోవడం వల్ల దళితుల భూములు ఆన్‌లైన్ చేసుకుని అగ్రకులస్తులు లబ్ధిపొం దుతున్నారని వాపోయారు. ఈ విధానం సరికాదని, పాలక పక్షాలు, అధికారులు స్పందించి వెంటనే అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి, పేద బడుగు వర్గాల వారికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో పూలే అంబేద్కర్ రాజ్యాధికారి సమితి కో- ఆర్డినేటర్ ముళ్లపాటి పిచ్చయ్య, పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి మండల అధ్యక్షులు ముళ్లపాటి ప్రకాశం, కారు దేవరాజు, వెంకటయ్య, ధర్మరాజు, పుల్లయ్య పాల్గొన్నారు.

అరటిలో అంతర్ పంటను పరిశీలిస్తున్న మాస్టర్ ట్రైనర్

అంతర పంటలతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రైతులు అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం సంపాదించవచ్చునని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఇ కొత్తపల్లి గ్రామపంచాయతీలో చంద్ర నారాయణ అనే రైతు ప్రధాన పంట అరటిలో అంతర పంటగా సాగు చేసిన మిరపను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతర పంటలుగా బెండ, మొటిక, చిక్కుడు, ముల్లంగి, క్యారెట్, బీట్రూట్, గోంగూర, మెంతికూర, కొత్తిమీర, చుక్కాకు, పాలకూర వేశారు. ప్రధాన పంట ఆదాయం వచ్చేసరికి 9 నెలలు అవుతుంది కాబట్టి రైతుకు పలు పంటలు, అంతర పంటల ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని చెప్పారు. రైతు ప్రధాన పంట కయ్యే పెట్టుబడిని తగ్గించుకుని ఎలాంటి పురుగు మందులు రసాయన మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా కషాయాలు ద్రావణాలతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించడంలో ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అన్ని రకాల పంటలు వేయడం వల్ల జీవ వైవిధ్యం కూడా పెరుగుతుందని పంటల చీడపీడల కూడా తగ్గుతాయని అన్నారు. ఇదే మాదిరి గ్రామంలోని రైతులు అందరూ ఈ పద్ధతులు పాటించి ఆదాయాన్ని పెంచుకోవాలని అన్నారు కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి చంద్రశేఖర్, శివయ్య, ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ ప్రవీణ, రైతు చంద్ర నారాయణ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ ఫలితాలలో సిబిఐటి విద్యార్థుల ప్రతిభ

చాపాడు : అనంతపురం జెఎన్‌టియు వారు విడుదల చేసిన ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం రెండవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కలశాలకు చెందిన విద్యార్థులు ఎంతో ప్రతిభను కనబరిచి ఉతమ ఫలితాలను సాధించారని ప్రిన్సిపల్ డా. జి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఇఇఇ విభాగానికి చెందిన పి. రాహుల్ 91.50, కె. సుదీర్ కుమార్ 90.75, ఎంపి జ్యోతి 90.25, ఎం.లక్ష్మి ప్రసన్న 90.25 , ఈసిఈ విభాగానికి చెందిన వై. నందిని 89.75, ఎం. బ్లేస్సి హవిల 89.50, యం. శ్రీలక్ష్మి 89.50, సిఎస్ఇ విభాగానికి చెందిన బి. మహాలక్ష్మి 88.25, షేక్. ఫక్రు 87.50, డి. భవ్య శ్రీ 86.50, పి.దివ్య 86.50, సివిల్ విభాగానికి చెందిన టి. కె. ధరణి 90.25, యం.అజిత్ 86.75, యస్. జమాల్ బాష 86.75 ,మెకానికల్ విభాగానికి చెందిన బి.వి. చైతన్య రెడ్డి 85.50, యస్.మహమ్మద్ జాఫర్ అలీ 85.50, బి .వి. ఉదయ్ కిరణ్ 84.75 మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు. తమ కళాశాల విద్యార్థులు సాధించిన ఫలితాల పట్ల చైర్మన్ డా.వి. జయ చంద్రా రెడ్డి, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర బృందం హర్షం వ్యక్తం చేశారు.

బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి : సిఐటియు

నిరసన తెలియజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని జమ్మలమడుగు సిఐటియు కమిటీ సభ్యులు దాసరి విజయ్ తెలిపారు. దేశ రాజధానిలో ఆందోళన చేస్తున్న రెజ్లర్ల పై మోడీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ జమ్మలమడుగు సిఐటియు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా విస్తరించేలాగా మహిళా క్రీడాకారులు బంగారు, కాంస్య, ఒలంపిక్, టోక్యో పతకాలు సాధిస్తుంటే వారికి అండగా నిలవాల్సిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఇండియా అధ్యక్షులు కంచే చేను మేసినట్లు వారిని వేధింపులకు పాల్పడం సిగ్గు చేటన్నారు. క్రీడాకారులపై లైంగిక వేధింపులు పాల్పడిన వారి పైన చర్య తీసుకోవాలని జనవరిలో ఆందోళనకు దిగితే ప్రభుత్వం కమిటీ వేసి విచారిస్తామని హామీ ఇచ్చి నాలుగు నెలైనా పట్టించుకోకపోవడంతో కొద్ది రోజుల కిందట ఏడు మంది మహిళా రెజ్లర్ల క్రీడాకారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారని తెలిపారు. కోర్టు సైతం ఇది తీవ్రమైన ఆరోపణ తక్షణమే ఢిల్లీ పోలీసులు చర్య తీసుకోవాలని ఆజ్ఞాపించిందని చెప్పారు. ఐదు రోజులుగా రాత్రి పగలు ఎండ వాన అనకుండా రెజ్లర్ల క్రీడాకారులు జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తుంటే మేధావులు, ప్రజా, మహిళ, రైతు సంఘాలు అండగా నిలుస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం దారుణమని వాపోయారు. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అధ్యక్ష పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఏ. వినయ్ కుమార్, సిఐటియు ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, సిఐటియు నాయకులు దస్తగిరి, రాజు, కమల్‌బాష పాల్గొన్నారు.

సాధనతోనే ఉన్నత స్థాయి : సిఐ

మెమోంటో అందుకున్న విద్యార్థులతో అర్బన్ సిఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సాధనతోనే ఏ వ్యక్తి అయినా తాను కోరుకున్న, ఎంపిక చేసుకున్న స్థాయికి చేరుతారని జమ్మలమడుగు అర్బన్ సిఐ సదా శివయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక బాలాజీ హైస్కూల్‌లో ఉత్తమ విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సదాశివయ్య మాట్లాడుతూ తాను ఫేర్వెల్ డే రోజు వచ్చి విద్యార్థులకు సూచనలిచ్చే సమయంలో బాలాజీ హైస్కూల్ జమ్మలమడుగులోనే టాప్‌లో ఉంటుందని చెప్పానని చెప్పారు. యాజమాన్యం పట్టుదల, విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే 590 మార్కులు సాధించారని చెప్పారు. ప్రతి విద్యార్థీ ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం బాలాజీ హై స్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతి విద్యార్థికీ, తల్లిదండ్రులకూ, ఉపాధ్యాయులకూ అభినందనలు తెలిపారు. 570 నుంచి 590 మధ్య మార్కులు వచ్చిన విద్యార్థులకు మెమెంటోతో పాటు వారి తల్లి దండ్రులకు శాలువా కప్పి అభినందించారు. 590 మార్కులు సాధించిన పరమేశ్వర్‌రెడ్డికి 10వ తరగతిలో చెల్లించిన ఫీజు మొత్తాన్ని తిరిగి ప్రైజ్ మనీగా ఇచ్చారు. తల్లిదండ్రులు లేకపోయినా మేనమామ అత్తలే తల్లితండ్రులై భూలక్ష్మి అనే విద్యార్థిని చదివించి అత్యధిక మార్కులు సాధించడంలో కీలక పాత్ర పోషించారని అభినందిస్తూ ఆ విద్యార్థికి రూ. 10 వేల బహుమతి అందజేశారు. 585 మార్కులతో సాలెం రాజు, 581 మార్కులతో సృజన్ కుమార్‌కు కొంత ప్రైజ్ మనీని బహుమతిగా అందజేశారు. సాంఘిక శాస్త్రంలో 99, వంద మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు జి సూర్య మిత్ర ఆర్థిక సహాయం అందజేశారు. అంతకుముందు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కె వి వి ప్రసాద్ రెడ్డి, బిఇడి ప్రిన్సిపాల్ ఆర్.భరత్ కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు ఖాసిం, హెచ్‌ఎం సూర్యమిత్రా, కరస్పాండెంట్ బైరెడ్డి దీప్తి నిఖిలా రెడ్డి ప్రసంగించారు. చివరగా సిఐ సదా శివయ్యను సన్మానించారు. కార్యక్రమంలో 500 మార్కులు పైబడిన విద్యార్థులు, తల్లిదండ్రులు, బాలాజీ హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో 'ఎస్‌విడిసి' యూనివర్శిటీ ఫస్ట్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక శ్రీకృష్ణ గీతాస్నంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు ఒకటి, మూడు సెమిస్టర్ ఫలితాలలో మంచి ప్రతిభ కనబరచి, యూనివర్సిటీ ఫస్ట్‌గా నిలిచారని కరస్పాండెంట్ అర్కాటవేముల హరినారాయణ తెలిపారు. 1వ సెమిస్టర్ బిఎస్‌సి బిజెడ్‌సి విభాగంలో ఎస్ ఎంఎస్ రెహనా 9.80 జిపిఏ సాధించి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిందని పేర్కొన్నారు. ఎస్.షబానా 9.64, సునీల్ కుమార్ 9.46, అల్లిరాణి 9.44, రూబీనా 9.30, ఎంఎస్ సిఎస్ విభాగంలో సులోచన 8.60, పి సుస్మా 8.51, బిబిఎ విభాగంలో ఎస్ సనా 8.33 జిపిఎ సాధించారని చెప్పారు. 3వ సెమిస్టర్‌లో ఎంఎస్ సిఎస్ విభాగంలో ఎస్. మహీన్ 9.52, ఎంపిసిఎస్ విభాగంలో ఆర్.లావణ్య 9.36, సి అరుణ 9.23, బిఎస్‌సి బిజెడ్‌సి విభాగంలో నాగసౌమ్య 9.33, సఫియా 9.20, బికామ్ విభాగంలో సభా ఖనం 8.34, రాఘవేంద్ర 8.32, బిబిఎ విభాగంలో కె. సుస్మా 8.90, అతుర్ రెహమాన్ 8.53, జీపీఏ సాధించారన్నారు ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ప్రిన్సిపల్ మహమ్మద్ ముస్తఫా, వైస్ ప్రిన్సిపల్ శారద భవాని, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీకాంత్‌రెడ్డి, రామ్మోహన్‌ను అభినందనలు తెలియజేశారు.

'వేదవ్యాస' విద్యార్థుల ప్రతిభ... యోగి వేమన యూనివర్సిటీ సెమిస్టర్ డిగ్రీ పరీక్షా ఫలితాలలో శ్రీ వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచారని కరెస్పాండంట్ ఎల్. నాగేశ్వరరెడ్డి తెలిపారు. మొదటి సెమిస్టర్ ఎంపిసిఎస్ విభాగంలో టి.అహమ్మద్ 9.66, ఎ.నాగ సుష్మిత 9.56. ఎంసిఎస్‌సిఎస్ విభాగంలో జి.లావణ్య 9.38, ఎస్.ఎం. అల్తాఫ్ 9.11. బి.కామ్ విభాగంలో కె.వినిత 8.96, వెంకటమ్మ 8.89, నసిరా భాను 8.89. మూడవ సెమిస్టర్ ఎంపిసిఎస్ విభాగంలో పి.అర్చన 9.33, వి.గాయత్రి 9.12. ఎంఎస్‌సిఎస్ విభాగంలో యు.భవాని 9.33, బి.శ్రీ దీక్షిత 9.09. బి.కామ్ విభాగంలో ఎ.హర్షిత 8.70, వి.లిఖిత రెడ్డి 8.50. మంచి ప్రతిభ కానబరిచారన్నారు .మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జి.సుదర్శన రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రామలక్ష్మిరెడ్డి, నాగరాజ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

విద్యార్థులతో ఎస్‌విడిసి కళాశాల కరస్పాండెంట్

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి : ఎంపిపి

ప్రజాశక్తి - వేంపల్లె

అంగన్వాడీ సెంటర్లలో చదివే విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని, సృజనాత్మకతను పెంచేందుకు కృషి చేయాలని ఎంపిపి లక్ష్మి గాయత్రి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సిడిపిఒ ఆధ్వర్యంలో క్రిష్టి యన్ కాలనీలో సంసిద్ధత ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రిష్టియన్ కాలనీలో చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులలో జ్ఞాపకశక్తిని పెంచడమే సంసిద్ధత ఉత్సవ్ లక్ష్యం అన్నారు. శారీరభివృద్ధి, బుద్ధి వికాసం, గణిత, భాషాభివృద్ధి, సృజనాత్మక అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అంగన్వాడీ సెంటర్లకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పిల్లలకు, గర్భిణులకు సకాలంలో అందించాలని కోరారు. ఆరోగ్య విషయాలపై చిన్నారుల తల్లిదండ్రులకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ సునీత, ప్రథమ్ సంస్థ సూపర్ వైజర్ స్వరూప రాణి, ఐసిడిఎస్ సూపర్ వైజర్ శ్రావణి, హెచ్ ఎం గోవిందు, అంగన్వాడీ కార్యకర్తలు అర్చన, ఆశా, మాలిని, రమాదేవి, శైలాజా, భాగ్యలక్ష్మి, లీలావతి, విజయకుమారి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారులతో ఎంపిపి లక్ష్మిగాయత్రి

రికార్డుల నిర్వహణ తప్పనిసరి

ప్రజాశక్తి - చాపాడు

రైతు భరోసా కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ క్రమం తప్పకుండా చేపట్టాలని జెడి కార్యాలయ డిడిఎ రాధా ధేవి సూచించారు. శుక్రవారం మైదుకూరు అగ్రి ల్యాబ్‌లో డివిజన్ పరిధిలోని విఎఎలు, విహెచ్ఎస్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో అన్ని రకాల రికార్డులను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ఈ నెల 20లోగా రైతులతో పిఎం కిసాన్, ఇకెవైసి పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకోవాలన్నారు. రైతుల నుంచి వచ్చే అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో ఎడిఎలు క్రిష్ణమూర్తి, మాధవి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

15న పుట్టా ఆధ్వర్యంలో పాదయాత్ర

ప్రజాశక్తి - చాపాడు

టిడిపి నియోజకవర్గ ఇన్ ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఈ నెల 15న మైదుకూరు నాలుగు రోడ్ల కూడలి నుంచి చాపాడు మండలం అల్లాడుపల్లె దేవాళాలు వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు శుక్రవారం సూచించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో పుట్టా మాట్లాడుతూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా 4వేల మందితో 7 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ,కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న పుట్టా సుధాకర్‌యాదవ్

మండల నాయకులను అభినందించిన పుట్టా...

మైదుకూరు మండల టిడిపి అధ్యక్షులు ఎం. సుబ్బారాయుడు సీనియర్ టిడిపి నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎం. రామచంద్రనాయుడు బృందాన్ని మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టాసుధాకర్‌యాదవ్ అభినందించారు. జిల్లాలోనే వంద శాతం ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో మైదుకూరు మండలం ఓటర్ వెరిఫికేషన్, హౌస్ మ్యాపింగ్ డ్యాష్ ప్రోగ్రాంలో వంద శాతం పూర్తి చేయడం అభినందనీయమన్నారు. తక్కువ సమయంలో ఓటర్ వెరిఫికేషన్ పూర్తిచేసి జిల్లా లోనే ప్రథమ స్థానం లోనిలిచిన సందర్భంగా మండల నాయకులందరిని పేరు పేరునా అభినందించారు.

నల్లబ్యాడ్జీలతో 104 ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

మండలంలోని చిన్న యర సాలలో 104 ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో ఫ్యామిలీ డాక్టర్ విధులు నిర్వహించారు. న్యాయ సమ్మతమైన తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టేకూరుపేట పిహెచ్‌సి డాక్టర్ వినోద్‌కుమార్, సిబ్బంది, డ్రైవర్ శ్రీరాములు, డేటా ఎంగ్రీ ఆపరేటర్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల సాగులో ఖర్చులను తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఎక్కువ మక్కువ చూపాలని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. శుక్రవారం లింగాపురంలో ప్రొద్దుటూరు ప్రకృతి వ్యవసాయ సహకార మార్కెటింగ్ సంఘాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సమిష్టిగా సేంద్రీయ ఎరువులతో వ్యవసాయం చేస్తే అధిక ప్రయోజనముంటుందని చెప్పారు. తాము పండించిన పంటలను సహకార సంఘం ద్వారా విక్రయిస్తే రైతులకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ సహకార సంఘాన్ని సంప్రదించి తగు సలహాలు, సూచనలు తీసుకొని ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రతాప్రెడ్డి, శేఖర్, డిసిసి బ్యాంకు అధికారులు, రైతులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాలి

ముద్దనూరు: గ్రామాల ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని మాజీ ఎంపిపి మునిరాజా రెడ్డి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం సభా భవనంలో శుక్రవారం మునిరాజా రెడ్డి అధ్యక్షతన ఎంపిడిఒ రమణారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు వారి శాఖల్లో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటి విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యా దీవెన, వసతి దీవెన నిధులను వైసిపి ప్రభుత్వం విడుదల చేయని కారణంగా రాష్ట్రంలోని ఆర్జెయుకెటి యూనివర్సిటీ పరిధిలోని ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం, నూజివీడు ట్రిపుల్ ఐటి విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి సాంకేతిక విద్యను అందించాలనే ఉద్దేశంతో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారభించిందని చెప్పారు. గత ప్రభుత్వాలు సకాలంలో ఫీజు రీయంబ్స్ మెంట్, స్కాలర్ షిప్స్ పథకాలను అమలు చేసేవని చెప్పారు. యాజమాన్యానికి, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావని చెప్పారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యా దీవెన, వసతి దివెన అని పేర్లు మార్చి పెట్టడం జరిగిందని అన్నారు. నిధులను కూడా సకాలంలో విడుదల చేయడం లేదని విమర్శించారు. ప్రస్తుతం ఒకొక్క విద్యార్థికీ మూడు దశల విద్యా దివెన నిధులు, రెండు దశల వసతి దివెన నిధులను పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఒక్కో విద్యార్థికి రూ. 57500 పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. దాదాపు 20 వేల మంది విద్యార్థులకు రూ 115 కోట్లు బకాయిలు చెల్లించాలని చెప్పారు. చివరి సంవత్సరంకు చెందిన 4 వేల మంది విద్యార్థులు ఉన్నారని వీరికి రూ 23 కోట్లు బకాయిలు చెల్లించాలని చెప్పారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించని కారణంగా ట్రిపుల్ ఐటి యాజమాన్యం విద్యార్థులకు చదువు పూర్తయినా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని అన్నారు. దీని వల్ల విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు వచ్చిన తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఉద్యోగ ప్రయత్నాలకూ ఆటంకంగా మారుతోందన్నారు. సర్టిఫికెట్లు ఇవ్వక పోవడంతో ట్రిపుల్ ఐటీ చదిన పేద విద్యార్థులకు ఆత్మహత్యలే శరణ్యం అన్నారు. ప్రభుత్వం వెంటనే విద్య దివెన, వసతి దీవెన నిధులను మంజూరు చేసి విద్యార్థులను ఆదుకోవాలని తులసిరెడ్డి కోరారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-ఖాజీపేట

మండల పరిధిలోని తవ్వారుపల్లెలో ఆదివారం నిర్వహించబోయే హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గ్రామంలో వీరాంజనేయస్వామి ఆలయాన్ని రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. జయంతి సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించడంతోపాటు భక్తులకు అన్నదానం నియమించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. స్వామి వారికి పంచామృతాభిషేక పూజలు, తీర్థ ప్రసాద వితరణ, శ్రీలక్ష్మి గణపతి హోమం, నవగ్రహ పూజలు, సాయంత్రం ఏడు గంటలకు వీరాంజనేయస్వామి గ్రామోత్సవం ఆలయ ప్రధానార్చకులు వనిపెంట లక్ష్మి మధుసూదన శర్మ ఆధ్వర్యంలో ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-ముద్దనూరు

దేశం తరపున వివిధ క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని ఆటల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో జమ్మలమడుగు రహదారిలోని జగనన్న కాలనీ వద్ద ఉన్న మైదానంలో శుక్రవారం నిర్వాహకులు, మండల యూత్ అధ్యక్షులు సుమంత్ యాదవ్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌కు ఎమ్మెల్యే, మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రికెట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులు సమన్వయం పాటించి క్రీడా స్ఫూర్తితో ఆటల్లో రాణించాలన్నారు. గెలుపు ఓటములు సహజం అన్నారు. క్రీడలు శరీర దృఢత్వాన్ని మానసిక ఉల్లాసానికి దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి వరదారెడ్డి, వైసిపి నాయకులు డాక్టర్ నవజ్యోత్ రెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, సిఐ నరేష్ బాబు,డిటి సుధీర్ యాదవ్, ఉప సర్పంచ్ వీరాంజనేయ రెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు రవి కుమార్, ఎంపిటిసి ఇంద్రాణి పాల్గొన్నారు. టోర్నమెంట్‌లో 40 జట్లు నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు, వైసిపి మండల యూత్ అధ్యక్షులు సుమంత్ యాదవ్ తెలిపారు.

పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ఉపయోగించుకోవాలి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : వేసవి సెలవుల్లో ఊర్లకు వెళ్లే వారు పోలీసులు రూపొందించిన ఎల్‌చ్‌ఎంఎస్ యాప్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ఎఎస్‌పి ప్రేరణకుమార్ తెలిపారు. వేసవి సెలవుల్లో విహార యాత్రలకు, శుభకార్యాలకు, ఊర్లకు వెళ్లే వారు ఎవరైనా పై సూచించిన యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇస్తే మీ ఇంటిలో కెమెరా బిగిస్తారని, తిరిగి వచ్చే వరకు ఇల్లు పోలీసు నిఘాలో ఉంటుందని తెలిపారు. తద్వారా ఎలాంటి చోరీలు చోటు చేసుకోకుండా మీ ఆస్తిపాస్తులను కాపాడతామన్నారు. మీరు ఊరికి వెళ్లే ముందుకు పోలీసులకు సమాచారం ఇచ్చి సదుపాయాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఎఎస్‌పి కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలో శనివారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎఇ జగదీశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయము 8.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంట వరకు పులివెందుల పట్టణంలో మరమ్మతుల కారణంగా అంతరాయం ఏర్పడుతుంది. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. **వేంపల్లెలో..** మండలంలోని వీరన్నగట్టుపల్లె, తాళ్ళపల్లె 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు జెఇ శివ ఒక ప్రకటనలో తెలిపారు. వీరన్నగట్టుపల్లె, తాళ్ళపల్లె ఎస్ఎస్ పరిధిలోని 11 కెవి ఫీడర్స్ కింద ఉన్న నందిపల్లి, వీరన్నగట్టుపల్లె గ్రామాల్లో విద్యుత్ ఫీడర్లను మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని కాబట్టి ఆయా గ్రామాల రైతులు, ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు. **ఎర్రగుంట్లలో..** ఆయా గ్రామాల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎపిఎస్‌పిడిసిఎల్ ఏడీ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని సబ్‌స్టేషన్లలో, 22 కెవి లైన్‌లో మరమ్మతులు చేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామన్నారు. ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు. **ప్రొద్దుటూరులో..** పనుల నిర్వహణలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని ఇఇ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనులు నిర్వహిస్తున్నందను ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు : ఆందోళనలో ప్రజలు

కొండాపురం : మండల కేంద్రంలో విద్యుత్ వైర్లు తెగిపడి ప్రమాదానికి కేంద్రబిందువుగా మారింది. నివాస గృహాల సమీపంలో ఉండడంతో చిన్నారులు, వృద్ధులు, ఇతరులు విద్యుత్ వైర్లను గమనించకపోతే పెను ప్రమాదం సంభవించేది. వివరాలు.. శుక్రవారం మండల కేంద్రంలోని శాంతినగర్ ప్రధాన రహదారిపై విద్యుత్ వైర్లు తెగిపడి నివాస గృహాల సమీపంలో పడింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ కనెక్షన్లు అస్తవ్యస్తంగా ఉండడంతో ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద విద్యుత్ వైర్లు తెగిపతెగి పడుతున్నాయి. విద్యుత శాఖాధికారులు పట్టించుకోకవడం శోచనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. పలుమార్లు సంబంధితాధికారులకు తెలియజేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. వారం రోజుల కిందట పట్టణంలోని సిఎంఆర్ కాలనీలో సమీపంలో విద్యుత్ స్తంభాలపైనే మంటలు చెలరేగాయి. ప్రస్తుతం విద్యుత్ వైర్లు తెగిపడి ప్రధాన రహదారిపై పడి ఉండడంతో ప్రజలు, నివాస గృహాల వారు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతోందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ వైర్లను సరిచేసి కనెక్షన్లను సక్రమంగా ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తెగిపడిన విద్యుత్ వైరు